సాక్షి సిద్దిపేట

సోమవారం । 21 । ఆగస్టు । 2023



రూ.లక్షలు లాగేస్తున్నారు!

సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. పార్ట్‌టైం జాబ్ పేరిట లింకులు పంపి అమాయకుల నుంచి డబ్బులు దండుకుంటున్నారు. 8లో..



చోరీలతో గుమ్మడిదడ

గుమ్మడిదల మండలంలో జరుగుతున్న వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. నెల రోజులుగా మూడు చోరీలు జరిగాయి. 8లో..



నాగుల పంచమికి ముస్తాబు

శ్రావణమాసం అంటేనే పండగలు, పూజలకు ప్రత్యేకం. సోమవారం నాగుల పంచమి సందర్భంగా జిల్లాలోని నాగదేవత ఆలయాలు ముస్తాబయ్యాయి. 9లో..

న్యూస్‌రీల్

ఆరోగ్యమే మహాభాగ్యం

పోలీస్ కమిషనర్ శ్వేత



హాఫ్ మారథాన్‌లో పాల్గొన్న వారికి మెడల్స్ అందజేస్తున్న సీపీ

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆరోగ్యమే మహాభాగ్యమని.. మనిషి జీవన శైలిలో వాకింగ్, రన్నింగ్, యోగా ఒక భాగం చేసుకోవాలని అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత అన్నారు. ఈ నెల 6న జరిగిన హాఫ్ మారథాన్ రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు, ఆర్గనైజర్లు, వాలంటీర్లకు ఆదివారం 21కే, 10 కే హాఫ్ మారథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రతివారం, నెలలో 5కే, 10కే, 21కే రన్ కార్యక్రమాలు నిర్వహించి సిద్దిపేట పట్టణంలో ఉన్న యువతీ, యువకులను, ఉద్యోగులను భాగస్వాములను చేయాలన్నారు. సెకండ్ ఎడిషన్ హాఫ్ మారథాన్ 10 వేల మందితో అద్భుతంగా నిర్వహించాలని సూచించారు. ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. అన్ని రోగాలకు విరుగుడు శారీరక శ్రమ అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ సురేందర్ రెడ్డి, సీఐలు, ఎస్ఐలు, సభ్యులు బాపురెడ్డి, నిరంజన్, వాలంటీర్లు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



కేసీఆర్, హరీశ్‌రావుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండలం జక్కాపూర్ మధిర గ్రామం శనిగకుంటను నూతన పంచాయతీగా ఏర్పాటు చేసినందుకు ఆదివారం గ్రామస్తులు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పరుశరాములు మాట్లాడుతూ గ్రామాన్ని నూతన పంచాయతీగా ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలకృష్ణ, వైస్ ఎంపీపీ సంతోష్, బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

ఎమ్మెల్యే రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుచుకొని అధికారంలోకి రావడం ఖాయమని షోలాపూర్ సౌత్ ఎమ్మెల్యే (మహారాష్ట్ర) సుభాష్ సురేశ్‌చంద్ర, ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం దుబ్బాకలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని మండలాల అధ్యక్షులు, కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ కుటుంబ పాలనకు ప్రజలు చరమగీతం పాడే రోజులు అసన్నమయ్యాయన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని ఆరోపించారు. కేవలం తమ కుటుంబం ఆస్తులు పెంచుకోవడం తప్ప ప్రజల బాగోగులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. బీజేపీని అధికారంలోకి తెస్తే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. కాంగ్రెస్ ను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. బీఆర్ఎస్,కాంగ్రెస్‌లు ఎన్ని ఎత్తుగడలు వేసినా తెలంగాణలో కాషాయం జెండా ఎగిరేది పక్కా అన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

'విద్యారంగాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు'

హుస్నాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్ అన్నారు. ఈ నెల 25న హుస్నాబాద్‌లో నిర్వహించే ఏఐఎస్ఎఫ్ సమావేశం కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ జాతీయ నూతన విద్యా విధానం తీసుకువచ్చి విద్యను కాషాయకరణ, కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నదన్నారు. ప్రభుత్వ విద్య రోజు రోజుకు కుంటుపడుతుందని, ఏడు మండలాలు ఉంటే కేవలం ఒక్క డిగ్రీ కళాశాల మాత్రమే ఉందన్నారు.

పనులు డొల్ల.. నాణ్యత కల్ల

- పలుచోట్ల దెబ్బతిన్న సిమెంట్ లైనింగ్
- వినియోగంలోకి రాకుండానే లీకేజీలకు అవకాశం
- గతేడాది ఇదే తరహాలో కాల్వకు గండ్లు
- దిద్దుబాటు చర్యల్లోనూ అధికారులు విఫలం

మల్లన్నసాగర్-సింగూరు కాల్వ నిర్మాణం పనులు మూణ్నాళ్ల ముచ్చటేనా?

ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న మల్లన్నసాగర్-సింగూరు కాల్వ పనుల్లో నాణ్యత కొరవడింది. గతేడాది ఈ కాల్వలోకి వరద పోటెత్తి.. పలుచోట్ల లీకేజీలు ఏర్పడగా ఈసారి కూడా అదే పరిస్థితి పునరావృతమయ్యే దుస్థితి కనిపిస్తున్నది. నాణ్యతలేని పనుల వల్ల కీలకమైన ఈ కాల్వపై పలుచోట్ల సిమెంట్ లైనింగ్ దెబ్బతిన్నది. కాల్వ వినియోగంలోకి రాకముందే ఇలాంటి దుస్థితి ఏర్పడటం.. పనుల్లో నాణ్యత లోపాలను అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గజ్వేల్ : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. కరువు నేలగా పేరున్న ఉత్తర తెలంగాణలో ఇది మరో కీలకమైన ప్రాజెక్టుగా మారింది. రైతుల సాగునీటి కష్టాలను శాశ్వతంగా తీర్చనుంది. ఇది పూర్తి కాగానే ఇక్కడినుంచి వివిధ జిల్లాలకు కాల్వల ద్వారా నీటిని తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే మల్లన్నసాగర్ నుంచి సంగారెడ్డి జిల్లాలోని సింగూరుకు కాల్వ నిర్మాణం 107కిలోమీటర్ల పొడవునా 6 వేలకుపైగా క్యుసెక్కుల సామర్థ్యంతో సాగుతోంది. ఈ కాల్వ 26.5 కిలోమీటర్ల వద్ద గజ్వేల్ నియోజకవర్గంలోని హల్దీ వాగు నింపనుండగా, 107కిలోమీటర్ల వద్ద సింగూర్ ప్రాజెక్టును నింపనున్నది. ఇప్పటివరకు సుమారుగా 60శాతానికిపైగా పనులు పూర్తయ్యాయి. మూడు ప్యాకేజీలుగా ఈ పనులను చేపట్టారు. గజ్వేల్ ప్రాంతంలో 17ప్యాకేజీ కింద పనులు చేపడుతున్నారు. పనుల తీరుపై ఆది నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడ చేపట్టిన పలు చోట్ల కాల్వకు సంబంధించిన సిమెంట్ లైనింగ్ దెబ్బతినడం, కట్టకు గండ్లు పడటం చోటుచేసుకుంటున్నది. ప్రత్యేకించి గతంలో గజ్వేల్ మండలం కొడకండ్ల, బూర్గుపల్లి, రిమ్మనగూడ గ్రామాల్లో 7కిలోమీటర్ల పొడవునా కాల్వ పనుల్లో గతంలో లోపాలు బయటపడ్డాయి. ఈ లోపాలను 'సాక్షి' ఎత్తి చూపింది. ఇదే క్రమంలో గతేడాది ఆగస్టు 18న ఇదే కాల్వ మల్లన్నసాగర్ నుంచి గజ్వేల్ మండలం బూర్గుపల్లి-దాచారం శివారు ప్రాంతాల వరకు సుమారు 25 కిలోమీటర్ల పొడవున మల్లన్నసాగర్ రిజర్వాయర్ లీకేజీ నీటితో నిండిపోయింది. దీంతో కాల్వలు ఎక్కడికక్కడా బుంగలు పడింది. కట్టకు గండ్లు పడిన చోట పంట పొలాల్లో నీరు చేరింది. అప్పట్లో కాల్వ దెబ్బతినకుండా తాత్కాలికంగా చర్యలు చేపట్టారు. లీకేజీల నివారణకు పకడ్బందీ చర్యలు మాత్రం కరువయ్యాయి. తాజాగా ఇదే కాల్వపై గజ్వేల్ మండలం రిమ్మనగూడ-క్యాసారం గ్రామాల మధ్యన ఉన్న బ్రిడ్జి వద్ద సిమెంట్ లైనింగ్ దెబ్బతిన్నది. కాల్వలోకి నీరు అధికంగా వస్తే నీరు లీకయ్యే ప్రమాదమున్నది. ఇక్కడే కాదు.. పలు చోట్ల ఇదే పరిస్థితి ఉంది. కాల్వ వినియోగంలోకి రాకముందే ఇలాంటి దుస్థితి ఏర్పడినా అధికారులు పట్టించుకోకపోవడం, పనుల్లో నాణ్యతలోపాలను



రిమ్మనగూడ-క్యాసారం మధ్య కాల్వపై దెబ్బతిన్న సిమెంట్ లైనింగ్

పర్యవేక్షించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో కొండపోచమ్మసాగర్ నుంచి వెళ్లే జగదేవ్‌పూర్ కాల్వ శివారు వెంకటాపూర్‌లోని అండర్‌పాస్ వద్ద బుంగపడి గ్రామంలోని ఇళ్లకు నీరు చేయడంతో ప్రజలు భయాందోళనకు గురైన విషయం విదితమే. ఇదే క్రమంలో తాజాగా మల్లన్నసాగర్- సింగూరు కాల్వతోనూ అదే తరహా ప్రమాదం పొంచి ఉండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.



మల్లన్నసాగర్-సింగూరు కాలువ

లోపాలను సరిచేస్తాం

మల్లన్నసాగర్-సింగూరు కాల్వ పనులపై మరోసారి క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతాం. ఎక్కడైనా లోపాలుంటే గుర్తించి సరిచేయడానికి ప్రయత్నిస్తాం. ప్రధానంగా సిమెంట్ లైనింగ్ దెబ్బతిన్న చోట లీకేజీలకు అవకాశముంటుంది. వీటిపై అప్రమత్తమై నివారణ చర్యలు చేపడతాం.

– రవీంద్రకిషన్, నీటి పారుదల శాఖ ఈఈ



ఎన్సాన్‌పల్లి చెరువు

చేప పిల్లలు రెడీ!

సాక్షి, సిద్దిపేట: జిల్లాలో ఉచిత చేప పిల్లల పంపిణీకి మత్స్యశాఖ సిద్ధమైంది. మత్స్యకారుల కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు తెలంగాణ ప్రభుత్వం ఉచిత చేప పిల్లలను చెరువుల్లో వదులుతున్నారు. ఇందుకోసం జిల్లా మత్స్యశాఖ ప్రణాళికలు రూపొందించింది. జిల్లా వ్యాప్తంగా 1,637 చెరువుల్లో 4.29కోట్ల చేప పిల్లలను వదిలేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తి కావచ్చింది. ఈనెల చివరి వారంలో చేపపిల్లల పంపిణీ ప్రారంభంకానుంది.

357 మత్స్యకార సొసైటీలు

జిల్లాలో 357 మత్స్యకార సొసైటీలుండగా 25,018 మంది సభ్యులు ఉన్నారు. అందులో 38 మహిళా సొసైటీల్లో 1,866 సభ్యులు, 319 పురుషుల సొసైటీల్లో 23,152 మంది సభ్యులున్నారు. జిల్లా వ్యాప్తంగా 2023-24 సంవత్సరానికి 1,637 చెరువుల్లో ఉచితంగా 4,29,99,960 చేప పిల్లలను వదిలేందుకు మత్స్యశాఖ ప్రణాళికలను రూపొందించింది. కట్ల, రవ్వలు, బంగారు తీగల రకం 35 నుంచి 40 మి.మీ సైజు చేప పిల్లలు, 1,390 చెరువుల్లో 1,64,61,588 చేప పిల్లలు, 80 నుంచి 100 ఎంఎం సైజు చేప పిల్లలు 247 చెరువుల్లో 2,63,78,302 వదలనున్నారు..

21న టెండర్ అగ్రిమెంట్

చేప పిల్లల సరఫరా కోసం గత నెలలో టెండర్లను పిలిచారు. ఇటీవలనే 35-40 మి.మీ.సైజు లక్ష చేప పిల్లలకు రూ.61,500, 80-100 మి.మీ. సైజు లక్ష పిల్లలకు రూ.1.64 లక్షలకు ఖరారు చేశారు. జిల్లా వ్యాప్తంగా చేప పిల్లలను సరఫరా చేసేందుకు ఆరుగురు కాంట్రాక్టర్లను ప్రభుత్వం నియమించింది. ఇప్పటికే ఆయా కాంట్రాక్టర్లకు సంబంధించిన చేప పిల్లల ఫాంలను తనిఖీలు చేశారు. ఈనెల 21వ తేదీన వారి నుంచి ఈఎండీలను సేకరించి అగ్రిమెంట్‌ను చేయనున్నారు.

ఈనెల చివరి నుంచి విడుదల

రాష్ట్ర మత్స్యశాఖ నుంచి ఆదేశాలు రాగానే ఈనెల చివరి నుంచి చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. తొలిసారిగా కొమురవెల్లి మల్లన్నసాగర్‌లో వదలనున్నారు. ఇప్పటికే రంగనాయకసాగర్, కొండపోచమ్మలో చేప పిల్లలను వదులుతున్నారు. ఈ మూడు రిజర్వాయర్‌లలో చేపలను పట్టేందుకు భూ నిర్వాసితులు, మత్స్యకార సొసైటీలకు మత్స్యశాఖ లైసెన్సులు జారీ చేయనుంది.

పంపిణీకి సర్వం సిద్ధం

- 1,637 చెరువుల్లో 4.29 కోట్ల చేప పిల్లలు
- జిల్లా వ్యాప్తంగా 357 మత్స్యకార సొసైటీలు
- గతేడాది 18 వేల టన్నుల చేపల ఉత్పత్తి
- ఈనెల చివరి నుంచి చెరువుల్లోకి విడుదల

గతేడాది రూ.186 కోట్ల ఆదాయం

జిల్లాలో 2022 సంవత్సరం ఉచితంగా 1,92,44,700 చేప పిల్లలను వదలగా 18,001 టన్నుల చేపలు ఉత్పత్తి అయ్యాయి. వీటి ద్వారా మత్స్యకారులు సుమారుగా రూ.186 కోట్ల ఆదాయం పొందారు. చెరువుల్లో నీటి నిల్వలు ఉంటుండంతో ప్రభుత్వం ఉచిత చేప పిల్లలను విడుదల చేయడంతో వారికి ఆదాయం లభిస్తోంది.

పది రోజుల్లో ప్రారంభిస్తాం

రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి చేప పిల్లల పంపిణీ ప్రారంభం కానుంది. మరో పది రోజుల్లో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. టెండర్ల ప్రక్రియ పూర్తి కావచ్చింది. చేపపిల్లలను సరఫరా చేసే కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్ ప్రక్రియ కావాలి. అన్ని చెరువుల్లో చేప పిల్లలను వదిలేందుకు ప్రణాళికలు రూపొందించాం.

– మల్లేశం, జిల్లా మత్స్య అభివృద్ధి అధికారి

సంస్కరణల సృష్టికర్త

- రాజీవ్‌గాంధీ ఆశయాలను కొనసాగిస్తాం
- డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి
- ఘనంగా జయంతి

సిద్దిపేటఅర్బన్: దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ సంస్కరణల సృష్టికర్త అని, ఆయన ఆశయాల సాధనకు కృషి చేస్తామని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ 79వ జయంతి సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పొన్నాల రాజీవ్ రహదారి వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు అత్తు ఇమాం, నాయకులు బొమ్మల యాదగిరి, గంప మహేందర్, సూర్య వర్మ, శ్రీనివాస్‌రెడ్డి, నాయిని నరసింహారెడ్డి, శంకర్, రాములు తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు, నాయకులు

బీఆర్ఎస్ పాలనలోనే పేదల అభ్యున్నతి



బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించిన ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

- ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి
- పార్టీలోకి పలువురి చేరికలు

గజ్వేల్: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం గజ్వేల్‌లోని సీఎం మినీ క్యాంపు కార్యాలయం ఆవరణలో వర్గల్, జగదేవ్‌పూర్ మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ప్రతాప్‌రెడ్డి కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఈ క్రమంలోనే ఎన్నో సాహసోపేత నిర్ణయాలతో ముందుకుసాగుతున్నారని కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల్లో చెరగని ముద్ర వేసుకోవడం ప్రతిపక్షాలకు మింగుడు పడటం లేదన్నారు. ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నాయని మండిపడ్డారు. ప్రతిపక్షాలు ఎన్ని రకాల కుట్రలు చేసినా ప్రజలు నమ్మేస్థితిలో లేరని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఇంకా ఈ కార్యక్రమాల్లో రైతు బంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవీ రవీందర్, జగదేవ్‌పూర్ మండల బీఆర్ఎస్ అధ్యక్షులు పనగట్ల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరమ్ జిల్లా అధ్యక్షులు కిరణ్‌గౌడ్, నాయకులు పిట్టల రాజు, ఐలయ్య, లక్ష్మన్, సత్యం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నా.. టికెట్ దక్కాలి!

కొమురవెల్లిలో ఎమ్మెల్సీ పోచంపల్లి ప్రత్యేక పూజలు



మల్లన్న స్వామి సేవలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్నను ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో కలసి స్థానిక పెట్రోల్ బంక్ నుంచి ర్యాలీ రాగా ఆలయ అర్చకులు ఒగ్గు పూజారులు ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం చేర్యాల పట్టణంలోని కల్యాణి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన భోజన కార్యాక్రమంలో పాల్గొన్నారు. జనగామ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ టికెట్ ఆశిస్తున్న నేపథ్యంలో మల్లన్నస్వామిని దర్శించుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉంటే.. బీఆర్ఎస్‌లో టికెట్ ఆశిస్తున్నవారి సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి వర్గాలుగా ఏర్పడిన విషయం విదితమే. ఇప్పుడు ఎమ్మెల్సీ పోచంపల్లి వర్గం ఏర్పడిందని ప్రచారం జరుగుతోంది. ముగ్గురిలో అదిష్టానం టికెట్ ఎవరికి కేటాయిస్తుందో వేచిచూడాల్సిందే. ఎమ్మెల్సీ వెంట మేర్గు శ్రీనివాస్, మంగోలు చంటి, మేడిశెట్టి శ్రీధర్, కామిడి రమేశ్‌రెడ్డి, ఆడేపు నరేందర్, మానస, చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూల్మిట్ట మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తుల సందడి

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సుమారు 8వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపారు. శ్రావణమాసం ఆరంభం కావడంతో భక్తుల రాక పెరిగింది. ఆలయ పరిసరాలు మల్లన్న నామస్మరణతో మారుమోగాయి.



వ్రతమాచరిస్తున్న భక్తులు



గర్భగుడిలో లక్ష్మీనృసింహస్వామివారు

నాచగిరికి శ్రావణశోభ

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి జిల్లాలో సుప్రసిద్ధమైన నాచగిరి లక్ష్మీనృసింహక్షేత్రం ఆదివారం శ్రావణ శోభతో అలరారింది. సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి క్షేత్ర సందర్శనకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో క్షేత్రంలో ఓ వైపు సత్యనారాయణ వ్రతాల సందడి, మరోవైపు అభిషేకాలు, గర్భగుడిలో కొలువైన స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులతో క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణం అలుముకున్నది. ఆలయ ఈఓ అన్నపూర్ణ పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు ఇబ్బంది కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

నేటి నుంచి సుదర్శన హోమం

లోక కల్యాణమే పరమావధిగా నాచగిరి శ్రీలక్ష్మీనృసింహక్షేత్రంలో సోమవారం నుంచి సెప్టెంబర్10 వరకు(21 రోజులు) రోజు ఉదయం 10.30 గంటలకు లక్ష్మీనృసింహ శ్రీసుదర్శన మహా హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ అన్నపూర్ణ తెలిపారు. శ్రావణమాసంలో నిర్వహిస్తున్న ఈ హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తరించాలని కోరారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


రంజిత్ చౌవాన్ (ఫైల్)

జహీరాబాద్ టౌన్: మండల పరిధిలోని తుంకుంట గ్రామ శివారులో రైలు పట్టాలపై అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందాడు. మృతుడు జహీరాబాద్ మండలం జమాల్ తండాకు చెందిన రంజిత్ చౌవాన్(19)గా వికారాబాద్ రైల్వే పోలీసులు గుర్తించారు. హెడ్‌కానిస్టేబుల్ అనిల్ కుమార్ వివరాలు ఇలా ఉన్నాయి. జమాల్ తండాకు చెందిన పాండు చౌవాన్ కుమారుడు రంజిత్ చౌవాన్(19) జేసీబీ డ్రైవర్. వికారాబాద్ జిల్లాలో పనిచేస్తున్న సమయంలో చిట్టంపల్లికి చెందిన ఓ అమ్మాయితో రంజిత్ ప్రేమలో పడ్డాడు. ఇతనిపై చందానగర్‌లో పీఎస్‌లో ఫిర్యాదు కూడా ఉంది. ప్రేమ వ్యవహారం కారణంగానే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అనుమానిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన తన కుమారుడిని హత్యచేసి రైలు పట్టాలపై పడేసి ఉంటారని రంజిత్ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వివరించారు.

వీధికుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు


గాయపడిన భరత్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలం జాడిమల్కాపూర్‌లో వీధి కుక్క దాడిలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి కుమారుడు భరత్‌రెడ్డి(8) ఆదివారం పొలానికి వెళ్తుండగా దారిలో ఉన్న కుక్క ఒక్కసారిగా దాడి చేసింది. పిల్లవాడు కేకలు వేయడంతో పక్కపొలంలో ఉన్న అతని బాబాయ్ పరుగెత్తుకుంటూ వచ్చి దానిని తరిమేశాడు. అప్పటికే బాలుడి ముఖం, తలపై తీవ్రగాయాలయ్యాయి. వెంటనే జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు.

గుర్తుతెలియని అస్థిపంజరం లభ్యం

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం గుర్తుతెలియని అస్థిపంజరం లభ్యమైంది. ఎస్‌ఐ ఈవీ రమణ వివరాలు.. అమీన్‌పూర్ మండలం గండిగూడ కాలనీ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న నీటి గుంతలో గుర్తు తెలియని వ్యక్తి అస్థిపంజరం లభ్యమైంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అస్థిపంజరంపై ఉన్న దుస్తుల ఆధారంగా మృతుడు పురుషుడిగా గుర్తించారు. మృతిచెంది సుమారు నెలకు పైగా కావొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలం వద్దే వైద్యుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి మృతదేహం..


నీటి గుంతలో మృతదేహం

నారాయణఖేడ్: పట్టణ శివార్లలోని మనూరు క్రాస్‌రోడ్డు సమీపంలోని నీటి గుంతలో ఆదివారం ఉదయం 35 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు గల గుర్తుతెలియని యువకుడి శవం లభించిందని ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు. మృతదేహంపై దుస్తులు లేవని తెలిపారు. మృతుడిని గుర్తిస్తే ఈ నెంబర్లకు 8712656757, 7032912233 సమాచారం అందించాలని అన్నారు.

రూ.లక్షలు లాగేస్తున్నారు

ఇప్పుడు ప్రతిఒక్కరూ డిజిటల్ పేమెంట్‌లు, ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహిస్తున్నారు. వీటిల్లో కీలకమైన ఓటీపీ నెంబర్ తెలుసుకొని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. పార్ట్‌టైం జాబ్‌లు అంటూ లింకులు పంపుతూ డబ్బులు దండుకుంటున్నారు. కొన్ని టాస్కులు ఇచ్చి పూర్తి చేస్తే రెట్టింపు నగదు వస్తుందని ఆశ చూపుతూ క్షణాల్లో లక్షల రూపాయలు దోచుకుంటున్నారు.

- రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- ఈ ఏడాది జూలై వరకు 1600 కేసులు
- ఫోన్‌కాల్, లింకులతో క్షణాల్లో బురిడీ
- బాధితులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, చదువుకున్నవారే అధికం



పటాన్‌చెరు టౌన్: సంగారెడ్డి జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు 1600 సైబర్ క్రైంలు జరిగాయి. అందులో 147 కేసులకు ఎఫ్ఐఆర్ నమోదైంది. అత్యధికంగా అమీన్‌పూర్, పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో నమోదయ్యాయి. మోసపోయిన వారంతా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, చదువుకున్న వారే కావడం గమనార్హం.

ఆన్‌లైన్‌లో అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నా కొందరు సైబర్ నేరగాళ్ల వలలో పడుతూనే ఉన్నారు. ఇటీవల ఒక్కో పోలీసు స్టేషన్లలో ఒకే రోజు రెండు మూడు కేసులు నమోదవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జరిగిన మోసం గురించి గంటల వ్యవధిలో బాధితులు 1930కు ఫోన్ చేసి సైబర్ పోలీసులకు చెబితే అకౌంట్ ఫ్రీజ్ చేయడంతోపాటు డబ్బు రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఈ కేసుల్లో సైబర్ నేరగాళ్లను పట్టుకున్న ఘటనలు చాలాతక్కువే ఉన్నాయి.

ఇటీవల మోసపోయిన వారు

- అమీన్‌పూర్ పరిధిలోని హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి జూన్ 28వ తేదీన పార్ట్‌టైం జాబ్ అంటూ వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. దానికి స్పందించడంతో రెట్టింపు నగదు ఇస్తామని చెప్పి 35 దఫాలుగా మొత్తం రూ.46 లక్షలు బాధితురాలి నుంచి కొట్టేశారు. మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.
- అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ జయలక్ష్మి నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి మే 29న పార్ట్‌టైం ఉద్యోగం కావాలా అంటూ మెసేజ్ వచ్చింది. స్పందించిన బాధితురాలు.. వివరాలు పంపడంతోపాటు అపరిచిత వ్యక్తులు చెప్పిన విధంగా నగదు పంపించింది. చివరకు తాను పెట్టిన రూ.8లక్షల 40వేలను పోగొట్టుకుంది.


అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)

ఇలా మోసపోతున్నారు..

- పార్ట్‌టైం ఉద్యోగం పేరుతో వచ్చిన మెసేజ్‌కు స్పందించి, వివరాలు నమోదు చేసి రెట్టింపు నగదు ఆశ చూపడంతో నగదు ఇన్వెస్ట్ చేసి డబ్బు పోగొట్టుకుంటున్నారు.
- వర్క్ ఫ్రం హోం ఉద్యోగాల కోసం గూగుల్‌లో వెతుకుతున్న సమయంలో సైబర్ నేరగాళ్లకు చిక్కుతున్నారు.
- ఫేస్ బుక్‌లో వాహనాలు, సెకండ్ హ్యాండ్ వస్తువుల ప్రకటనను క్లిక్ చేసి మోసపోతున్నారు.
- మరి కొందరు మోసగాళ్లు ఏటీఎం కార్డు అప్‌డేట్, ఆరోగ్య భద్రత కార్డులు ఇస్తామని ఫోన్ చేసి మాటల్లో దించి వివరాలు సేకరించి బాధితుడి బ్యాంక్ ఖాతా నుంచి డబ్బు మాయం చేస్తున్నారు.

"జిల్లాలో ఈ ఏడాది 1600మంది సైబర్ నేరగాళ్ల వలలో పడి రూ.10 కోట్ల 88 లక్షల, 63 వేలు పోగొట్టుకున్నారు. అందులో ఒక కోటి 84 లక్షల 42 వేల 307 రూపాయలను ఫ్రీజ్ (హోల్డ్) చేశారు."

అపరిచితుల మెసేజ్, ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దు



ఆన్‌లైన్‌లో అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్, ఫోన్ కాల్స్‌కు స్పందించకండి. ప్రస్తుత సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోతుంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, చదువుకున్న వారే ఎక్కువ. పటాన్‌చెరు సబ్ డివిజన్ పరిధిలోని పటాన్‌చెరు, అమీన్‌పూర్, బీడీఎల్, జిన్నారం, బొల్లారం, గుమ్మడిదల, హత్నూర పోలీసు స్టేషన్ పరిధిలో సైబర్ క్రైం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– పురుషోత్తంరెడ్డి, డీఎస్పీ, పటాన్‌చెరు

గద్దర్ పేరును మెదక్ జిల్లాకు పెట్టాలి


మాట్లాడుతున్న డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

గజ్వేల్: ప్రజాగాయకుడు గద్దర్ పేరును మెదక్ జిల్లాకు పెట్టాలని ప్రజా సంఘాల నాయకులు తీర్మానించారు. ఆదివారం గజ్వేల్‌లోని టీపీటీఎఫ్ కార్యాలయ భవనంలో నిర్వహించిన గద్దర్ సంస్మరణ సభలో డీబీఎఫ్ (దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పి.శంకర్, సీనియర్ జర్నలిస్టు ఆస శ్రీరాములు, దళిత బహుజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు దేవీ రవీందర్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దాసరి శ్యామ్ మనోహర్, ఎంపీపీ అమరావతి, జెడ్పీటీసీ మల్లేశం, టీపీటీఎఫ్ గజ్వేల్ జోన్ అధ్యక్షులు నరేందర్ పాల్గొని మాట్లాడారు. ప్రజల గొంతుకగా తన జీవితాన్ని ధారబోసిన గద్దర్ పాట చిరస్మరణీయమన్నారు. ఆయన విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసి స్మృతివనం నిర్మించాలన్నారు. డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి అధ్యక్షతన జరిగిన ఈ సభలో మాల మహానాడు జాతీయ నాయకుడు తుమ్మ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సఫాయి కార్మికురాలి కొడుకు అగ్నివీర్‌గా..


రమేశ్

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్ మండలం కోనాయపల్లి గ్రామ పంచాయతీలో సఫాయి కార్మికురాలి కొడుకు భారత సైనికుడిగా నియామకమయ్యాడు. స్థానిక పంచాయతీలో కార్మికురాలిగా పనిచేస్తున్న గువ్వలపల్లి ఎల్లవ్వ కొడుకు రమేశ్ ఇటీవల భారత ప్రభుత్వం నిర్వహించిన సైనిక పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటి అగ్నివీర్‌గా నియామకమయ్యాడు. దీంతో గ్రామస్తులు అతడిని అభినందిస్తున్నారు.

చోరీలతో గుమ్మడిదడ


విచారణ జరుపుతున్న పోలీసులు

- వరుస దొంగతనాలతో జనం బెంబేలు
- నెల రోజుల్లో మూడు ఘటనలు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలో జరుగుతున్న వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. నెల రోజులుగా మూడు చోరీలు జరిగాయి. పది రోజుల క్రితం గుమ్మడిదల గ్రామంలోని ఎల్లమ్మ, మల్లమ్మ దేవాలయాల్లోని హుండీలను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి అందులోని సొమ్మును ఎత్తుకెళ్లారు. రెండు రోజుల క్రితం రాంనగర్ కాలనీలో భద్రయ్య ఇంట్లో ఆరున్నర తులాల బంగారం, 30తులాల వెండి, టీవీ చోరీకి గురైందని బాధితులు చెబుతున్నారు. అదేవిధంగా తాజా ఓ ఆటోను కూడా గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని చెబుతున్నారు.

పనిచేయని సీసీ కెమెరాలు

గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయటం లేదు. నెలలు గడుస్తున్నా వాటిని బాగు చేయించకపోవడంతో దొంగలు రెచ్చిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇతర రాష్ట్రాల నుంచి వలసలు

ఈ ప్రాంతంలో పారిశ్రామిక వాడలు ఉండటంతో ఇతర రాష్ట్రాల నుంచి వారు ఇక్కడికి వలస వస్తున్నారు. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, బిహార్ ప్రజలు పరిశ్రమల్లో పనిచేయడానికి వచ్చి ఉంటున్నారు. కొన్నిసార్లు వారికి ఉపాధి లభించక ఇలాంటి చోరీలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విచారణ చేపడుతున్నాం



దొంగతనాలపై విచారణ చేపడుతున్నాం. పారిశ్రామిక వాడల్లో తనిఖీలు చేస్తున్నాం. అనుమానం ఉన్న వారిని విచారిస్తున్నాం. చోరీలకు పాల్పడ్డ వారిని త్వరలోనే అదుపులోకి తీసుకుంటాం. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. అనుమానం ఉన్న వారు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి.

– లక్ష్మారెడ్డి, ఎస్ఐ, గుమ్మడిదల

జగ్గారెడ్డి మా పార్టీలోకి వస్తే ఉపముఖ్యమంత్రిని చేస్తాం

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్


సమావేశంలో మాట్లాడుతున్న కేఏ పాల్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రజాశాంతి పార్టీలో చేరితే ఎమ్మెల్యేగా గెలిపించి ఉపముఖ్యమంత్రిని చేస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ పేర్కొన్నారు. ఆదివారం మండలపరిధిలోని మద్దికుంట శివారులోని చారిటీ సిటీలో పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గెలిపించి ముఖ్యమంత్రిని చేస్తే నిరుద్యోగులకు లక్ష ఉద్యోగాలు కల్పిస్తానన్నారు. పార్టీ అభ్యర్థులను గెలిపించిన నియోజకవర్గాల్లో నిరుద్యోగులు లేకుండా చేస్తానన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే పార్టీ లక్ష్యమన్నారు. పాలనా రావాలి.. పాలన మారాలి.. మార్పు రావాలి అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సామాజిక న్యాయం, అవినీతి లేని రాజ్యం, అందరికీ అధికారం, అభివృద్ధి తమ పార్టీతోనే సాధ్యమన్నారు.

అవార్డు అందుకున్న సాక్షి ఫొటోగ్రాఫర్లు



అవార్డు అందుకుంటున్న కె.సతీష్, శివప్రసాద్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో విజేతగా నిలిచిన సిద్దిపేట సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ సతీష్, సంగారెడ్డి జిల్లా సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ బి.శివప్రసాద్ ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఆదివారం నగరంలోని రవీంద్రభారతిలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు, సంక్షేమశాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా వీరు ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో ప్రతిభ


బ్రౌన్ మెడల్‌తో విద్యార్థులు

కోహెడరూరల్(హుస్నాబాద్): రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో మండలంలోని నాగసముద్రాల ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల కరీంనగర్ జిల్లాలోని మానేరు హైస్కూల్‌లో ఈనెల 19 నుంచి 20వరకు జరిగిన తెలంగాణ జూనియర్ ఇంటర్ జిల్లా జూడో చాంపియన్ షిప్‌లో పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో జెళ్ల నేహ, దాసరి శ్రీచరణ్, మద్దెల హరిత వెయిట్ విభాగంలో 3వ స్థానం సాధించి బ్రౌన్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పీఈటీ భరత్‌రెడ్డిని ప్రిన్సిపాల్ అభినందించారు.

కారు బోల్తా.. ఒకరి దుర్మరణం


కుకునూర్‌పల్లి వద్ద రాజీవ్ రహదారిపై బోల్తా పడిన కారు

కొండపాక(గజ్వేల్): కారు అదుపు తప్పి బోల్తా పడటంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధి రాజీవ్ రహదారిపై కుకునూర్‌పల్లి వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ పుష్పరాజ్ వివరాలు. నెల్లూరు జిల్లా ఏఎస్‌పేట మండలం అంబసాహెబ్‌పేట గ్రామానికి చెందిన గంగపట్నం వంశీ(25) హైదరాబాద్‌లోని అమెజాన్ కంపెనీలో పని చేస్తూ సెలవు రోజుల్లో తన కారును ట్యాక్సీకి నడిపిస్తుంటాడు. ఇదే క్రమంలో మంచిర్యాలకు కిరాయి ఉండడంతో శనివారం సాయంత్రం వెళి ఆదివారం ఉదయం నగరానికి తిరుగు ప్రయాణమయ్యాడు. కుకునూర్‌పల్లి సమీపంలోకి రాగానే అతివేగంగా వచ్చిన కారు రాజీవ్ రహదారిపై డివైడర్ పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని అవతలి వైపు రోడ్డుపై పల్టీ కొట్టింది. దీంతో కారును నడుపుతున్న వంశీ అక్కడికక్కడే మృతి చెందాడు. కారు రోడ్డుపై పడడంతో కొద్దిసేపు ట్రాఫిక్ జాం అయింది. పోలీసులు అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టి వంశీ మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య వెంకట సత్యవతి ఫిర్యాదు మేరకు కుకునూర్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గృహిణి అదృశ్యం

మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గృహిణి కేసు నమోదైంది. ఆదివారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం సంత్ రవిదాస్‌నగర్ జిల్లా అమావఖాడ్ గ్రామానికి చెందిన ధర్మేందర్ భారతి కాళ్ళకల్‌కు వలస వచ్చి స్థానిక పరిశ్రమలలో పని చేస్తున్నాడు. జూన్‌లో నిషా అనే అమ్మాయితో వివాహమైంది. కాగా, ఆమె ఈ నెల 19న ఇంట్లోంచి చెప్పకుండా వెళ్లిపోయింది. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఇంటి నుంచి వెళ్లిన యువతి..


హరిత (ఫైల్)

పటాన్‌చెరు టౌన్ : పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యం కేసు నమోదైంది. హెడ్ కానిస్టేబుల్ భీమ్‌రావు వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం పలాసకు చెందిన హరిత(20) పది రోజుల క్రితం పటాన్‌చెరు మండలం ఇంద్రేశం ఆర్‌కే నగర్ కాలనీలో ఉంటున్న పెద్దమ్మ శశికళ ఇంటికి వచ్చింది. 18వ తేదీ రాత్రి ఎవరికీ చెప్పకుండా హరిత ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించగా ఇంటి నుంచి వెళ్లిన రోజు అర్ధరాత్రి ఓ యువకుడితో వెళ్తున్నట్లు గుర్తించారు.

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం


పంకజ్‌కు స్వాగతం పలుకుతున్న స్థానిక నేతలు

గజ్వేల్‌రూరల్: క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి చేద్దామని మహారాష్ట్రలోని వార్ధా నియోజకవర్గానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యే పంకజ్ రాజేష్ భోయర్ పేర్కొన్నారు. బీజేపీ పిలుపు మేరకు తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో 119 మంది బీజేపీ ఎమ్మెల్యేల పర్యటనలో భాగంగా గజ్వేల్ నియోజకవర్గ పర్యటనకు వచ్చిన ఆయనకు ఆదివారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రజ్ఞా గార్డెన్స్‌లో వారం రోజులపాటు చేపట్టనున్న కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. బీజేపీని బూత్ స్థాయిలో బలోపేతం చేస్తూ అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కప్పర ప్రసాదరావు, గురువారెడ్డి, శ్రీనివాస్, మనోహర్‌యాదవ్, మహేష్, సురేష్, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

జహీరాబాద్ టౌన్: అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మొగుడంపల్లి మండలం మన్నాపూర్‌లో చోటు చేసుకుంది. చిరాగ్‌పల్లి పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మన్నూర్ తుకారం(27) తన పెళ్లి కోసం, వ్యవసాయ పెట్టుబడికి చేసిన అప్పు తీర్చలేక మద్యంకు అలవాటు పడ్డాడు. శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య రేణుక, ఏడాది పాప ఉంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..

కోహిర్(జహీరాబాద్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని ఖానాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ సురేష్ వివరాలు. గ్రామానికి చెందిన గత్ప నర్సింహులు(32) రెండేళ్లుగా కర్ణాటకలోని కుంచారంలో నివాసం ఉంటూ మగ్దుంపురం చౌరస్తా వద్ద టీ కొట్టు పెట్టుకొని జీవిస్తున్నాడు. ఆదాయం లేక కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. శుక్రవారం అప్పుల వాళ్ళు పిలుస్తున్నారని చెప్పి కోహీర్‌కు వచ్చాడు. తరువాత ఏం జరిగిందో తెలియదు కానీ సాయంత్రం పురుగు మందు తాగానని ఇంటికి ఫోన్ చేసి చెప్పాడు. అపస్మారక స్థితికి చేరుకున్న అతన్ని కోహీర్ ఆస్పత్రికి, అక్కడి నుంచి సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించాడు. మృతుడికి భార్య జగమ్మ, నలుగురు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

భవనంపై నుంచి పడి కూలీ మృతి

సిద్దిపేటకమాన్: ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కింద పడి కూలీ మృతి చెందిన సంఘటన సిద్దిపేటలో చోటు చేసుకుంది. పట్టణ టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం కొండగావ్ మండలంలోని నాకసల్‌కు చెందిన సోరి హంతు, అనిత్, సంతు (25) ముగ్గురు అన్నదమ్ములు. జీవనోపాధి కోసం ఆరు రోజుల క్రితం సిద్దిపేటకు వచ్చారు. పట్టణంలోని నారాయణకు చెందిన బోరు బండిపైన వీరు లేబర్‌గా పని చేస్తున్నారు. అనిల్ బోరు బండిపైన పనికి వెళ్లగా, అనిత్, సంతు తోటి లేబర్లతో కలిసి భోజనం చేసి కరీంనగర్ రోడ్డులోని ఓ భవనంపైన శనివారం రాత్రి పడుకున్నారు. ఈ క్రమంలో సంతు నిద్రమత్తులో బిల్డింగ్‌పై నుంచి కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. తోటి కూలీలు అతడిని సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. వైద్యుడు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

వేట కోసం వెళ్లి.. శవమై ప్రత్యక్షం


రాజయ్య (ఫైల్)

పాపన్న పేట (మెదక్): 33 రోజుల క్రితం వేట కోసం వెళ్లిన ఓ వ్యక్తి అస్థిపంజరంగా కనిపించిన సంఘటన ఆదివారం మిన్‌పూర్‌గుట్టల్లో వెలుగు చూసింది. పాపన్నపేట ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపిన కథనం ప్రకారం. కామారెడ్డి మండలం గాలిపూర్‌కు చెందిన అల్లం రాజయ్య (45) పాతికేళ్లక్రితం బతుకు దెరువు కోసం పాపన్నపేటకు వచ్చాడు. చేపలు, అటవీ జంతువులను వేటాడుతూ కుటుంబ సభ్యులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల 17న వేట కోసమని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతని కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం మిన్‌పూర్ గుట్టల్లోని బండ రాళ్ల మధ్య అస్థిపంజరం ఉన్నట్లు గుర్తించిన మేకల కాపరులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడ దొరికిన గడ్డపార, దుస్తుల ఆధారంగా మృతుడు అల్లం రాజయ్యగా గుర్తించారు. ఈ మేరకు పోలీసులు అక్కడే శవ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు.